ఉన్నత విద్యా ప్రమాణాలకు 'శ్రీచైతన్య గ్లోబల్ క్యాంపస్'

సీబీఐ పూర్వ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీబీఐ పూర్వ జేడీ లక్ష్మీనారాయణ

ఖమ్మం అర్బన్, మార్చి 9 : విద్యార్థులకు అంతర్జాతీయ విద్యను అందించేందుకు 'శ్రీచైతన్య గ్లోబల్ క్యాంపస్' మంచి వేదిక అవుతుందని సీబీఐ పూర్వ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం నగరం పుట్టకోట శ్రీచైతన్య గ్లోబల్ విస్టా' క్యాంపస్‌లో ఫ్యూచరిస్టిక్ గ్లోబల్ ఎడ్యుకేషన్ బియాండ్ బౌండరీస్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రసంగించారు. కృత్రిమ మేధ నేటి విద్యా వ్యవస్థకి, సమాజానానికి ఏ విధంగా దోహదపడుతుందో వివరించారు. దాని వలన కలిగే ప్రయోజనాలను, అంతర్జాతీయ విద్యాప్రమాణాల ద్వారా నేటితరం విద్యార్థులు వారి లక్ష్యాలను సునాయాసంగా ఏ విధంగా అధిగమిస్తున్నారో తెలియజేశారు. ప్రస్తుతం మారుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా సీబీఎస్ఈ కేంబ్రిడ్జ్ గ్లోబల్ ఎక్స్పోజర్ కోసం విద్యార్థులకు అంతర్జాతీయ విద్యను అందించేందుకు గ్లోబల్ విస్టా క్యాంపస్‌ను ఏర్పాటు చేసిన శ్రీచైతన్య యాజమాన్యాన్ని అభినందించారు. శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకత, మేధో ఉత్సకత ప్రేరేపించడం ద్వారా అంతర్గత క్రమశిక్షణను అలవర్చుకోవచ్చునన్నారు. శ్రీచైతన్య సంస్థల డైరెక్టర్ శ్రీవిద్య, పాఠశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మల్లెంపాటి సాయిగీతిక, ఏజీఎంలు, ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కందాళ పర్యటన


నివాళి అర్పిస్తున్న కందాళ

ఖమ్మం కూసుమంచి, మార్చి 9: మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ఆదివారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. రాజుపేట గ్రామంలో ఇటీవల మృతిచెందిన మోదుగు సీతమ్మ, కేతిరెడ్డి లక్ష్మయ్య, కనకం గురువయ్య, ఎర్రబోలు గురువారెడ్డి, నందినిరెడ్డి కోటిరెడ్డి, మోడపు శ్రీనివాస్ కుటుంబాలను పరామర్శించారు. చిత్రపటాల వద్ద పూలు చల్లి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేముల వీరయ్య, సొసైటీ చైర్మన్ ఎర్రబోలు చంద్రారెడ్డి, కల్లూరుగూడెం సొసైటీ చైర్మన్ వాసంశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో కేసీఆర్ నిలిచిపోయారు

మధిర(చింతకాని), మార్చి 9: ప్రజల గుండెల్లో కేసీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారని బీఆర్‌ఎస్ చింతకాని మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య అన్నారు. ఆదివారం మండలంలోని లచ్చగూడెం గ్రామంలో సీఎం కేసీఆర్ చిత్రపటంతో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు పంపించిన క్యాలెండర్, డైరీలను పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి బొడ్డు వెంకటరామయ్య, గురజాల హనుమంతరావు, గడ్డం శ్రీనివాసరావు, వేముల నర్సయ్య, మర్రి ప్రకాష్, సిలారుసాహెబ్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌడ సంఘం కమిటీ ఎన్నిక

నూతన కమిటీని సన్మానిస్తున్న జిల్లా నాయకులు

ఖమ్మం రూరల్, మార్చి 9: తెలంగాణ గౌడ సంఘం మండల నూతన కమిటీని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎస్ నగర్‌లో శనివారం రాత్రి గౌరవాధ్యక్షుడు అంబాల వెంకటేశ్వర్లు స్వగృహంలో జరిగిన సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షుడిగా అంబాల వెంకటనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సూధగాని హనుమంతరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వీరమల్ల సంతోష్, ఉపాధ్యక్షులుగా బొమ్మగాని రమేష్, బొమ్మగాని వంశీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కమిటీని జిల్లా నాయకులు సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు కత్తి నెహ్రూ గౌడ్, కార్యదర్శి మార్కం లింగయ్య, నాయకులు మొక్కా శేఖర్, దొంతగాని వెంకటేశ్వర్లు, చామకూరి రవీందర్, అశోక్, ఊర్మిళ, శ్రీకాంత్, సిలివేరు బాబు, కొండం కరుణాకర్, ఏడుకొండల్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంపై చర్యలు తీసుకోవాలి

పెనుబల్లి, మార్చి 9: తమతో అసభ్యంగా ప్రవర్తించి అవమానపరుస్తున్న ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని కల్లూరు ఆర్డీవోకు చేసిన ఫిర్యాదుపై విచారణను తప్పించుకునేందుకు ఏపీఎం బీరవల్లి రాంబాబు బకాయిలను అవినీతిగా చూపుతున్నారని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ ఆరోపించారు. కల్లూరు మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఐకేపీ ఏపీఎం రాంబాబు విలేకరులకు వివరించినట్లుగా నిధులు గోల్‌మాల్ కాదని, కేవలం రికవరీ చేయాల్సిన నిధులు మాత్రమేనని, అదికూడా సభ్యులు దగ్గరే ఉండిపోయాయయన్నారు. మహిళలపై అసభ్యంగా మాట్లాడుతున్న బీరవల్లి రాంబాబును శాసనసభ్యులు కూడా మందలించినట్లు తెలిపారు.

సాంస్కృతిక కార్యక్రమాలు విజయవంతం

వైరాటౌన్, మార్చి 9: వ్యవసాయం సంక్షోభంతో మహిళలు మరింత ఆహార, ఆర్థిక బాధలు ఎదుర్కొనే పరిస్థితి ఉందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మహిళా రైతు సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో వైరాలో సాంస్కృతిక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. చింతనిప్పు సులోచన, దుగ్గినేని సౌజనయ, అడపా వెంకటలక్ష్మి, చెరుకుమల్లి రాధా, పేరసాని కళావతి వివిధ ఆటల్లో విజతలుగా నిలిచారు. విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. మాదినేని రమేష్, బొంతు సమత, చింతనిప్పు సులోచన, కిలారు లక్ష్మి, అమరనేని విజయ, చండ్ర జయ, చింతనిప్పు ఉషా, చెరుకుమల్లి రాధా, తాతా నాగమణి, వడ్లమూడి ఇందిరా, పాసంగుల పాటి బేబి, అడపా వెంకటలక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైనా సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

సైలో బంకర్ కాలుష్యంతో మరొకరు మృతి

- ఇన్‌ఫెక్షన్‌తో మూడు రోజుల క్రితం ఒకరి మృత్యువాత
- కాలుష్యంతో 50 రోజుల క్రితమే ఒకరి బలవన్మరణం
- మొత్తం మూడుకు చేరిన సైలో బంకర్ బాధిత మరణాలు
- నెల రోజులుగా రిలేదీక్ష చేస్తున్న అంబేద్కర్‌నగర్ వాసులు
- అయినా స్పందించని పాలకులు, సింగరేణి అధికారులు

మృతిచెందిన రామాల బుజ్జిబాబు (ఫైల్)

సత్తుపల్లి టౌన్, మార్చి 9: సైలో బంకర్ కాలుష్యం కారణంగా ఆదివారం మరొకరు మృతిచెందారు. దీంతో కాలుష్యం కారణంగా జరిగిన మరణాలు మూడుకు చేరుకున్నాయి. సింగరేణి సత్తుపల్లి జేవీఆర్ -1, 2, కిష్టారం ఉపరితల గనుల్లో ఉత్పత్తి అయిన బొగ్గును బెల్టు మార్గం ద్వారా కిష్టారం సమీపంలోని సైలో బంకర్‌కు తరలిస్తుంటారు. ఆ బొగ్గును రైలు వ్యాగన్లలోకి ఈ సైలో బంకర్ నింపుతుంది. ఇలా నింపే క్రమంలో భారీగా వెలువడుతున్న కాలుష్య కారక బొగ్గు పొడి, దుమ్ము, ధూళి వంటివి అక్కడికి కేవలం 90 మీటర్ల సమీపంలోనే ఉండే అంబేద్కర్‌నగర్ కాలనీపై పడుతున్నాయి. ఈ కాలుష్యం కారణంగా అంబేద్కర్‌నగర్‌కాలనీ వాసులు ప్రాణాంతక వ్యాధుల భారిన పడుతున్నారు. ఈ క్రమంలో.. అదే కాలనీకి చెందిన బుర్ర తుకారం (36) కూడా ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ భారిన పడ్డాడు. ఈ సైలోబంకర్ కాలుష్యంతో తనకు ప్రాణహాని ఉందంటూ ఈ ఏడాది జనవరి 17న అతడు సెల్ఫీ వీడియోలో ఆవేదన వ్యక్తం చేస్తూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీంతో కాలనీవాసులు ఆగ్రహానికి గురయ్యారు. సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం వెంటనే స్పందించి తమ ప్రాణాలను రక్షించాలని డిమాండ్ చేశారు. సైలో బంకర్‌ను తరలించడంగానీ, లేదంటే తమకు పునరావాసం కల్పించడం గానీ చేయాలంటూ పట్టుబట్టారు. ఇదే విషయమై నెల రోజులుగా రిలేని రాహార దీక్షలు చేస్తున్నారు. అయినా, అటు సింగరేణి గానీ, ఇటు ప్రభుత్వం గానీ స్పందించలేదు. ఇటు దీక్షలు కొనసాగుతుండగానే, అటు తుకారం బలవన్మరణాన్ని మరువకముందే అదే కాలనీకి చెందిన పిల్లి లక్ష్మీనారాయణ (47) కూడా శుక్రవారం ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్, శ్వాసకోశ వ్యాధితో మృత్యువాత పడ్డాడు. అతడు మరణించి రెండు రోజులు కూడా గడవకముందే అదే ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్, క్యాన్సర్ వ్యాధితో రామాల బుజ్జిబాబు (39) ఆదివారం మృతిచెందాడు. కాలుష్యాన్ని వెదజల్లే సైలోబంకర్ కారణంగా 50 ఏళ్లలోపు ఉన్న ముగ్గురు వ్యక్తులు కొద్దిరోజుల వ్యవధిలోనే మత్యువాత పడడంతో కాలనీలో మరింత ఆందోళన మొదలైంది. దీంతో ఈ వరుస మరణాలపై జిల్లాలోని ముగ్గురు మంత్రులూ స్పందించడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శాశ్వత పరిష్కారం చూపకపోతే సింగరేణిని స్తంభింప చేస్తామంటూ హెచ్చరిస్తున్నారు.

'రవన్న' స్ఫూర్తితో పోరాటాలు

మాట్లాడుతున్న రమేష్ పట్నాయక్

ఖమ్మం, మార్చి 9 : ఖమ్మంలోని రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రవన్న 9వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యవక్త విద్యా పరిరక్షణ వేదిక ఆలిండియా నాయకుడు రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ దేశంలో ప్రజల్ని మనవు, మార్కెట్ అనే కవల పిల్లలు కలిసి దోపిడీకి గురిచేస్తున్నాయని, ప్రజలు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రముఖ సంపాదకుడు సతీష్ చందర్ మాట్లాడుతూ సమాజంలో అన్నిరంగాలను పెట్టుబడిదారీ వ్యవస్థ నియంత్రిస్తుందన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు కేజీ రామచందర్ మాట్లాడుతూ రవన్న అతివాద, అవకాశవాదలకు వ్యతిరేకంగా అంతర్గత పోరాటం జరిపి సరైన ప్రజాపంథా కోసం విప్లవోద్యమాన్ని నిర్మించారని అన్నారు. సీనియర్ నాయకులు కెచ్చల రంగయ్య, గుర్రం అచ్చయ్య అధ్యక్షత వహించగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, రమా, వెంకటేశ్వర్లు, అరుణ, భిక్షం, నరేందర్ ప్రసంగించారు. సభ ప్రారంభానికి ముందు వందలాది మంది పార్టీ కార్యకర్తలు పెవిలియన్ గ్రౌండ్ నుంచి వైరా రోడ్డు మీదగా ఇల్లెందు క్రాస్ రోడ్ నుంచి ఎన్ఎస్‌టీ రోడ్డు మీదుగా రామ నరసయ్య విజ్ఞాన కేంద్రం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమరవీరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి రవన్న ఫొటోకు పూల మాల వేసి నివాళులర్పించారు. కళాకారుల ఆట పాట ఆకట్టుకుంది. కార్యక్రమంలో నాయకులు చిన్న చంద్రన్న, హన్మేశ్, పద్మ, వెంకటేశ్వర్లు, పుల్లయ్య, రామయ్య, మనోహర్‌రాజు, కల్పన తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కర్నాటి వీరభద్రం

బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన ప్రతినిధులు

ఖమ్మం సిటీ, మార్చి 9 : ఖమ్మం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కర్నాటి వీరభద్రం నియమితులయ్యారు. ఆదివారం సాయంత్రం ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా విజ్రంపర్తి చంద్రశేఖర్, కోశాధికారిగా జట్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా సీనియర్ క్రీడాకారుడు కమర్తపు మురళి, బాలసాని ఆనంద్, దుద్దుకూరి సత్యనారాయణ, కొంగర శ్రీనివాస్, రెగ్గర్ల శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా చావ వెంకటేశ్వరరావు, కొల్లి రమేష్, రవిబాబు, వై రమణ, కార్యవర్గ సభ్యులుగా మందపల్లి అనిల్, వీ సాయికృష్ణ, ఎస్ నాగేశ్వరరావు, వై పాపారావు, ఎన్ శివరాం, నవీన్‌రెడ్డి, ఎం కృష్ణారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంటా వెంకట్రావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో బ్యాడ్మింటన్ అభివృద్ధికి నూతన కార్యవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ బాధ్యులు పీ రవిమారుత్, పాటిబండ్ల యుగంధర్, సిరిపురపు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

'ఎటువంటి ఈవెంట్‌కు అనుమతి లేదు'

ఖమ్మం అర్బన్, మార్చి 9 : ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో రానున్న హోలీని పురస్కరించుకుని అసంబద్ధమైన, అనర్థమైన ఈవెంట్ జరుగుతున్నదని కొంతమంది సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరికీ, ఎటువంటి అనుమతి ఇవ్వలేదని వెల్లడించారు.

కవయిత్రి యువశ్రీబీరకు నారీరత్న అవార్డు

అవార్డుతో సన్మానం అందుకుంటున్న కవయిత్రి యువశ్రీ

ఖమ్మం అర్బన్, మార్చి 9 : ఖమ్మం నగరంలోని ఇందిరానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు యువశ్రీబీర నారీరత్న అవార్డును సొంతం చేసుకున్నారు. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సీఈవో కత్తిమండ ప్రతాప్, జాతీయ మహిళా అధ్యక్షురాలు లలిత, రమావతి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు యువశ్రీబీరను అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం

కూసుమంచి (నేలకొండపల్లి), మార్చి 9: నూతక్కి గంగాధర్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేలకొండపల్లిలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటైంది. 158 మందిని వైద్యులు పరీక్షించారు. షుగర్, బీపీ బాధితులకు నెలకు సరిపడినన్ని మందులను కేవలం వంద రూపాయలకే ఇచ్చారు. కంటి సమస్యలున్న 39 మందిని ఇదే వైద్య శిబిరంలో మాక్స్ విజన్ ఆస్పత్రి వైద్యులు పరీక్షించారు. నిర్వాహకుడు ఏటుకూరి రామారావు, డాక్టర్లు కొల్లి అనుదీప్, కూరెల్లి పవన్ కళ్యాణ్, బండారుపల్లి నాగేశ్వరరావు, బండి పుష్పలత, అనీల్‌కుమార్, వసుంధర, నాగేశ్వరరావు, సూర్యానారాయణరావు, జమాల్‌పాషా, నర్సింహారావు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

డప్పు ప్రదర్శన

ఖమ్మం కూసుమంచి (నేలకొండపల్లి), మార్చి 9: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేంత వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆదివారం నేలకొండపల్లిలో డప్పు ప్రదర్శనను ఎంఆర్‌పీఎస్ నిర్వహించింది. మాదాసు వెంకన్న, పడికత్తుల వీరయ్య, బాలస్వామి, చెరుకుపల్లి రాజేష్, తోళ్ల సురేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం

మామిళ్లగూడెం, మార్చి 9 : ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్‌బండ్ సమీపంలో ఉన్న ఓ వెంచర్‌లో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వృద్ధురాలు మృతి చెంది ఉండడాన్ని కొందరు వ్యక్తులకు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ సీఐ ఉదయ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని అన్నం ఫౌండేషన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

కోదండ రామస్వామి, ముత్యాలమ్మ, బొడ్రాయి ప్రతిష్ట

ఎర్రుపాలెం, మార్చి 9: మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలోని కోదండ రామస్వామి, ధ్వజస్తంభ ప్రతిష్ట, ముత్యాలమ్మ, బొడ్రాయి ప్రతిష్టా మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రాతఃకాల పూజలు, పుణ్యాహవచనం, గర్తన్యాసం, రత్నన్యాసం, ధానువ్యాసం, బీజన్యాసం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు జరిపారు.

ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ట

సత్తుపల్లిటౌన్, మార్చి 9: సత్తుపల్లిలోని ద్వారకాపురి కాలనీ 7వ రోడ్డులో నూతనంగా నిర్మించిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ బాధ్యులు రాగాల చంద్రారెడ్డి, ద్రోణంరాజు మల్లికార్జునశర్మ, వందనపు సత్యనారాయణ, సోమిశెట్టి శ్రీధర్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

మధిర, మార్చి 9: ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు మధిర పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో కొట్టే రుత్విక్‌సాయి (ఐపీఎస్), ఎస్సై చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. మధిర సమీపంలోని మున్నేరు వద్ద కొంతమంది పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేశారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 5 సెల్‌ఫోన్లు, రూ.2700 నగదు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సోలార్ విద్యుత్ లబ్ధిదారుల ఎంపిక సర్వే

బోనకల్లు, మార్చి 9: సోలారు విద్యుత్ లబ్ధిదారుల ఎంపిక కోసం సోమవారం నుంచి సర్వే జరుగుతుందని మండల విద్యుత్‌శాఖ అధికారి మనోహర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులందరికీ సోలార్ విద్యుత్ అందించేందుకు సర్వే జరుగుతుందన్నారు. లబ్ధిదారుల ఎంపిక సర్వే కార్యక్రమం బుధవారం వరకు కొనసాగుతుందని, గ్రామంలోని సర్వే నిర్వహిస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించి వివరాలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు.

నేడు ఎల్ఆర్ఎస్‌పై అవగాహన సదస్సు

మామిళ్లగూడెం/ ఖమ్మం, మార్చి 9 : స్టాంపులు, రిజిస్ట్రేషన్స్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశానుసారం ఎల్ఆర్ఎస్‌ను అనుసరించి రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన విధివిధానాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ ఎం.రవీందర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 9గంటలకు ప్రాంభమవుతుందని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వెంచర్ల యజమానులు, ప్లాట్ల యజమానులు, దస్తావేజు లేఖరులు హాజరుకావాలని సూచించారు.

ఆర్యవైశ్యులకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

ఖమ్మం, మార్చి 9 : రాష్ట్రంలో చేపట్టిన కులగణన ప్రకారం అగ్రవర్ణాలలో ఆర్యవైశ్య సామాజికవర్గం ప్రథమస్థానంలో ఉన్నందున శాసనమండలిలో ఆర్యవైశ్యులకు ఒక స్థానాన్ని కేటాయించాలని రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ సంఘ అధ్యక్షుడు సిద్ధంశెట్టి శ్రీకాంత్, వెలంపల్లి వెంకట సుబ్బారావు, కొదుమూరి భద్రయ్య, జనార్దన్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

మండల వాసికి 'భారత్ విభూషణ్' అవార్డు

కొణిజర్ల, మార్చి 9: మండలంలోని పెద్దగోపతికి చెందిన జానపద, అభ్యుదయ, భక్తి పాటల గాయకుడు నకిరికంటి వెంకట్‌కు 'భారత్ విభూషణ్' అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో నిర్వహించిన జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వెంకట్‌కు ఈ అవార్డు అందించారు. ఈ అవార్డును జీసీఎస్ వల్లూరు ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ వీ.ఆర్.శ్రీనివాసరాజ్, నీరటి సుధాకర్‌రావు, కాచే కృష్ణవేణి చేతుల మీదుగా అందజేశారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న పువ్వాడ

ఖమ్మం, మార్చి 9 : రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత పువ్వాడ అజయ్‌కుమార్ ఆదివారం ఖమ్మం నగరంలో విస్తృతంగా పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 58వ డివిజన్‌కు చెందిన ప్రముఖ గ్రానైట్ వ్యాపారి, బీఆర్ఎస్ నాయకుడు వేముల రవి ఇటీవల కంటి చికిత్స చేయించుకోగా ఆయన్ని పరామర్శించారు. ఎన్ఎస్‌పీ క్యాంప్‌లోని మక్కా మజీద్‌లో జనాబ్ ముఫ్తి ఫరూక్ మదాని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకులను పేదలకు పంచారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, నాయకులు తోట రామారావు, శీలంశెట్టి వీరభద్రం, తాజుద్దీన్, కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, బుర్రి వెంకట్ పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

మధిర, (చింతకాని) మార్చి 9 : అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సమన్వయ సమితి మాజీ సభ్యులు మంకెన రమేష్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గురజాల హనుమంతరావు డిమాండ్ చేశారు. ఆదివారం చింతకాని మండలం చిన్నమండవ గ్రామంలో ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన తుపాకుల అగ్గి రాముల కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. పంటల పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు తీరక ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక రైతాంగం నష్టపోతున్నారన్నారు. అగ్గి రాముడు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగులవంచ పి ఎస్‌సీ డైరెక్టర్ వంకాయలపాటి వెంకట లచ్చయ్య, చిన్నమండవ బీఆర్ఎస్ నాయకులు పర్సగాని ఏడుకొండలు, కందిమల్ల శీను, మరీదు లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ సోంపోగు బాబు, దారెల్లి నాగరాజు, కాశిమల్ల ఫ్రాన్సిస్, పరస గాని బసవయ్య,బండి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంని కలిసిన విద్యుత్‌శాఖ ఎస్ఈ

మామిళ్లగూడెం, మార్చి 9 : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఖమ్మం జిల్లా విద్యుత్‌శాఖాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. డిప్యూటీ సీఎం నివాసంలో కలిసిన ఎస్ఈతో ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన సోలార్ విలేజస్ సర్వే పూర్తిచేసి వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికే మంజూరు చేసిన కొత్త 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. ఎస్ఈతోపాటు డివిజనల్ ఇంజినీర్లు ఉన్నారు.

మెడికల్ మాఫియా ఆగడాలను అరికట్టాలి

మామిళ్లగూడెం, మార్చి 9 : జిల్లాలో మెడికల్ మాఫియా చేస్తున్న అక్రమ అబార్షన్లు, ఆగడాలను అరికట్టాలని పలువురు వ్యక్తులు డిమాండ్ చేశారు. ఆదివారం బీఎస్‌పీ ఖమ్మంజిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో అఖిల పక్షాలు, పలు సామాజిక సంఘాల ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. బీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు మాట్లాడుతూ నగరంలో అక్రమ అబార్షన్లు దారుణంగా జరుగుతున్నాయని, తల్లి కడుపులోనే శిశు బాలికలను హత్య చేస్తున్నారని ఈ రకమైన చర్యలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో మెడికల్ మాఫియా ఆగడాలను అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని అన్నారు. సమావేశంలో అయితగాని శ్రీనివాసగౌడ్, లింగాల రవికుమార్, భద్రూనాయక్, కె.రాంబాబు, స్వర్ణ సుబ్బారావు పాల్గొన్నారు.

దార్శనికుడు కేఎస్ రామారావు

కేఎస్ రామారావును సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మం అర్బన్, మార్చి 9 : నిబద్ధత కలిగిన ఉద్యోగి, దార్శనికుడు, సంఘ నాయకుడిగా నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కేఎస్ రామారావు ఆదర్శనీయుడని ఇంటర్ విద్య జేఏసీ చైర్మన్ డాక్టర్ పి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన రామారావును ప్రత్యేకంగా సన్మానించారు. రామారావు మూడు దశాబ్దాలకు పైగా ఇంటర్ విద్యను బలోపేతం చేయడంలో కీలకపాత్రను పోషించారని కొనియాడారు. టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటర్ విద్యను, జూనియర్ లెక్చరర్ల సంఘాన్ని వినూత్నంగా తీర్చిదిద్దడంలో అమూల్యమైన సేవలందించారని ప్రశంసించారు. కార్యక్రమంలో కళింగ కృష్ణకుమార్, డీఐఈవో రవిబాబు, బలరాం, జాదవ్, రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాధవరావు, రజిత, గోనారెడ్డి, అంజన్‌గౌడ్, నర్సిరెడ్డి, పద్మావతి, లక్ష్మణరావు పాల్గొన్నారు. సభాధ్యక్షుడిగా వాసిరెడ్డి శ్రీనివాస్ వ్యవహరించారు. రామారావు దంపతులను సన్మానించారు.

మేడూరుకు కలయిక వాకర్స్‌క్లబ్ సభ్యుల పాదయాత్ర

పాదయాత్రగా మేడూరు వెళ్లిన వాకర్స్ క్లబ్ సభ్యులు

మధిర, మార్చి 9: మధిర పట్టణంలోని బంజారాకాలనీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం నుంచి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం మేడూరులోని వీరాంజనేయస్వామి ఆలయానికి వాకర్స్ కలయిక క్లబ్ సభ్యులు కాలినడకన ఆదివారం చేరుకున్నారు. క్లబ్ సభ్యులకు మేడూరు ఆంజనేయస్వామి వారి దేవస్థానం చైర్మన్ స్వాగతం పలికి అనంతరం దేవాలయ అర్చకులు పాదయాత్ర చేసిన సభ్యులందరి గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. అనంతరం క్లబ్ సభ్యులకు స్వామి వారి తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు. ఇరుకుళ్ల బాలకోటేశ్వరరావు, మైలవరపు వీరభద్రరావు, డోకుపర్తి సత్యంబాబు, అప్పన లక్ష్మీనారాయణ, బోనాల నాగేశ్వరరావు, రవికిరణ్, వంగూరి గోపి పాల్గొన్నారు.

దుస్తులు వితరణ

మధిర, మార్చి 9: గాంధీజీ బట్టల బ్యాంకుకు దుస్తులు వితరణ చేయాలని సీనియర్ సిటిజన్, సంఘ సేవకులు, విశ్రాంతి ఎంపీడీవో మాధవరావు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం సంఘ సేవకులు, మహాత్మా గాంధీ ఉచిత పాత బట్టలు కేంద్రం నిర్వాహకులు, లంకా సేవా ఫౌండేషన్ నిర్వాహకులు లంకా కొండయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఉపయోగంలో లేని కొత్త, పాత మిగిలిన అదనపు దుస్తులను ప్రతిఒక్కరూ గాంధీజీ బట్టల కేంద్రానికి ఇవ్వాలన్నారు. అదేవిధంగా డాక్టర్ వీ.భాస్కర్‌రావు, మిరియాల రమణగుప్త, కోన ధని, కొల్లా రాజా, తదితర ప్రముఖులు అదనపు బట్టలు కొండయ్యకు అందజేశారు. ఈ బట్టలు ఇతర ప్రాంతాల నుంచి బతుకు దెరువు కోసం వచ్చిన గిరిజనులకు పేద కూలీలకు కొండయ్య పంపిణీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ముప్పర రాంబాబు, ముప్పారు సత్యనారాయణ, మల్లికార్జున్, పార్క్ వెంకటేశ్వర్లు, సూర్యదేవర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల నివాళి

తిరుమలాయపాలెం, మార్చి 9: మండలంలోని మేడిదపల్లి సర్పంచ్ బండ్ల సురేష్ తల్లి లక్ష్మమ్మ(85) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. మృతదేహాన్ని బీఆర్ఎస్ నాయకులు చావా వేణు, ఆర్మీ రవి, బోడ మంచానాయక్, ముదిరెడ్డి లచ్చిరెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.